
ప్రజల సమస్యలను వింటున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రజావాణికి 56 ఫిర్యాదులు

రంగారెడ్డి అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 56 ఫిర్యాదులు వచ్చాయి. అత్యధికంగా రెవెన్యూ శాఖకు 25 ఫిర్యాదులు రాగా, ఇతర శాఖలకు సంబంధించి 31 వచ్చాయి. ప్రజల నుంచి కలెక్టర్ సి.నారాయణరెడ్డితో పాటు అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ వినతులను స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. టెన్త్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. పరీక్షల అనంతరం హాస్టల్ విద్యార్థులను సురక్షితంగా వారి ఇళ్లకు చేరేలా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని హౌజింగ్ పీడీకి సూచించారు. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల పరిధిలో తాగునీటి కొరత ఏర్పడకుండా చూడాలని డీపీవోకు, మున్సిపల్ కమిషనర్లకు, మిషన్ భగీరథ అధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో సంగీత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుడిసెలు వేసుకున్నవారికి
ఇళ్ల పట్టాలివ్వాలి
ఎమ్మెల్యే యాదయ్యను కోరిన సీపీఐ నాయకులు 6

ఆకాశమే హద్దుగా!

ఉమ్మడి జిల్లాలో ప్రగతి పరుగులు

ఉమ్మడి జిల్లాలో అభివృద్ధి అన్ని రంగాల్లో ఆకాశమే హద్దుగా పరుగులు పెడుతోంది. శరవేగంగా జరుగుతున్న పారిశ్రామిక విస్తరణలో భాగంగా శివార్లలో అత్యధికంగా పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. గడచిన ఏడాది కాలంలో రూ.6,045 కోట్ల పెట్టుబడులతో 448 పరిశ్రమలు నెలకొల్పారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సామాజిక ఆర్థిక సర్వే (2025)లో అనేక ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. తలసరి ఆదాయం, స్థూల ఉత్పత్తిలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు అగ్రస్థానంలో నిలిచాయి. పెట్టుబడులు, ఎగుమతుల్లోనూ రాష్ట్రంలో అగ్రభాగంలో ఉన్నాయి.

అన్ని రంగాల్లో దూసుకుపోతున్న అభివృద్ధి
తలసరి, స్థూల ఆదాయంలో సరికొత్త రికార్డులు
అంతర్జాతీయ ఎగుమతుల్లోనూ అగ్రస్థానం
శివార్లలో శరవేగంగా పారిశ్రామిక విస్తరణ
ఉపాధి హామీ పనుల్లోనూ మేటి

రాష్ట్ర సామాజిక, ఆర్థిక సర్వే 2025 సూచికలు

తలసరి ఆదాయం జిల్లాల వారీగా

జిల్లా	తలసరి ఆదాయం
రంగారెడ్డి	రూ. 10,55,913
మేడ్చల్	రూ. 3,43,130
వికారాబాద్	రూ. 1,98,401

స్థూల ఉత్పత్తి (రూ.కోట్లలో)

జిల్లా	స్థూల ఉత్పత్తి
రంగారెడ్డి	రూ.3,17,898
మేడ్చల్	రూ.1,04,710
వికారాబాద్	రూ.22,066

(21వ స్థానంలో వికారాబాద్)



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ప్రకారం రంగారెడ్డి జిల్లా రూ.10,55,913 తలసరి ఆదాయంతో అగ్రస్థానంలో నిలిచి.. దేశంలో తొలిసారిగా తలసరి ఆదాయంలో రూ.10లక్షల మార్క్ దాటిన జిల్లాగా రికార్డుల్లోకి ఎక్కిన విషయం తెలిసిందే. మేడ్చల్ మల్కాజ్‌గిరి(రూ.3,43,130) నాల్గో స్థానంలో నిలిచింది. ఇదిలా ఉంటే పెట్టుబడులు, ఉపాధి, ఎగుమతులు, ఇతర ఆర్థికాభివృద్ధి అంశాల్లో ఉమ్మడి జిల్లా శరవేగంగా దూసుకుపోతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. కొత్త పరిశ్రమలకు అనుమతులు

మిగతా 7వ పేజీలో...

9 నెలల్లో రూ.60వేల కోట్లు

శివార్లలో శరవేగంగా జరుగుతున్న పారిశ్రామిక విస్తరణ కారణంగా రాష్ట్రంలోనే అత్యధికంగా ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. దీంతో ఇక్కడ నుంచి దేశ, విదేశాలకు ఎగుమతులు కూడా భారీగా పెరిగాయి. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల నుంచే ఐటీ, ఫార్మా ఎగుమతులు కూడా అధికంగా జరుగుతున్నాయి. 2024 ఏప్రిల్ నుంచి 2024 డిసెంబర్ వరకు 9 నెలల కాలంలో రాష్ట్రంలో దాదాపు రూ.లక్ష కోట్ల విలువైన ఉత్పత్తులు ఎగుమతి జరగగా ఇందులో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచే దాదాపు రూ.60వేల కోట్లు ఉండడం గమనార్హం. రంగారెడ్డి జిల్లా నుంచి 9 నెలల కాలంలో రూ. 41,535 కోట్లు, మేడ్చల్ జిల్లా నుంచి రూ.17,652 కోట్ల ఎగుమతులు

ఖనిజ ఉత్పత్తుల ఆదాయంలోనూ..

ఖనిజ ఉత్పత్తుల ద్వారా ఆదాయం అధికంగా వచ్చే జిల్లాల్లో రంగారెడ్డి జిల్లా అగ్రస్థానంలో ఉంది. ఖనిజ ఉత్పత్తుల రాబడిలో రూ.115.12 కోట్లతో మొదటి స్థానంలో రంగారెడ్డి జిల్లా నిలవగా సూర్యాపేట (రూ115.11 కోట్లు) రెండో స్థానంలో ఉంది. వికారాబాద్ 88.49 కోట్లతో 5వ స్థానంలో ఉండగా, మేడ్చల్ రూ.44.57 కోట్లతో 20వ స్థానంలో ఉంది.

మేడ్చల్‌లో బీఆర్ఎస్ సభ!

ఔటర్ సమీపంలో స్థల పరిశీలన

- పార్టీ రజతోత్సవానికి పకడ్బందీగా ఏర్పాట్లు
- వరంగల్ జిల్లా నుంచి వేదిక మార్పు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన రజతోత్సవ ఆవిర్భావ సభను వరంగల్ జిల్లా నుంచి మేడ్చల్ జిల్లాకు మార్చాలని పార్టీ నాయకత్వం నిర్ణయించినట్లు తెలిసింది. బీఆర్ఎస్ (టీఆర్ఎస్) ఆవిర్భవించి 25ఏళ్లు అవుతున్న సందర్భంగా ఏప్రిల్ 27వ తేదీన వరంగల్‌లో రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ నాయకత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి ఇప్పటి నుంచే జిల్లాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. మళ్లీ పార్టీ పూర్వవైభవం తీసుకువచ్చేందుకు భారీగా జనసమీకరణ చేస్తోంది.

నగరంపై పట్టు బిగించేలా..

అయితే ఎండ తీవ్రత అధికంగా ఉండే అవకాశాలు ఉండడంతో ఈ సభను అందరికీ అందుబాటులో ఉండే విధంగా మేడ్చల్ జిల్లా పరిధిలో నిర్వహించే విషయాన్ని పార్టీ నాయకత్వం పరిశీలిస్తోంది. ఇందులో భాగంగా దుండిగల్ నుంచి ఘట్‌కేసర్ మధ్య ఔటర్ రింగురింగురోడ్డుకు సమీపంలో బహిరంగ సభ కోసం స్థలాన్ని పరిశీలించాలని సోమవారం జిల్లా పార్టీ నాయకత్వానికి అధినేత నుంచి ఆదేశాలు అందాయి. ట్రాఫిక్ ఇతర సమస్యలు లేకుండా ఔటర్‌కు ఆనుకునే ఉండే విధంగా ఈ సభను నిర్వహించేలా నిర్ణయించినట్లు సమాచారం. శివార్లలో భారీ బహిరంగ సభ నిర్వహించడం వల్ల నగరంపై మళ్లీ పట్టుకొనసాగించాలని బీఆర్ఎస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే ఈ సభకు జాతీయ, అంతర్జాతీయ మీడియాను కూడా ఆహ్వానిస్తుండడంతో హైదరాబాద్‌లో అంతర్భాగంగా ఉన్న ఈ ప్రాంతంలో సభను నిర్వహించడం మేలని బీఆర్ఎస్ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

మా భూములు తీసుకోవద్దు

యాచారం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మేమంతా నిరుపేద రైతులమని, పారిశ్రామిక పార్కు కోసం మా భూములు తీసుకోవద్దని యాచారం మండలం మొండిగౌరెల్లి రైతులు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రమందించారు. ఫ్యూచర్‌సిటీలో గ్రామాన్ని విలీనం చేసి అభివృద్ధి చేస్తారనుకుంటే మాకున్న కొద్దిపాటి భూములను లాక్కునేందుకు యత్నించడం సరికాదన్నారు. ఆ భూములు తీసుకుంటే రోడ్డునపడతామని కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. భూసేకరణ కోసం జారీ చేసిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు.

మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో కలపాలి

- అభివృద్ధికి బీజేపీ వ్యతిరేకం కాదు
- పేదల భూమి లాక్కుంటే ఊరుకోం
- బీజేపీ జాతీయ కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు పాపయ్యగౌడ్


బీజేపీ జాతీయ కిసాన్‌మోర్చ కార్యవర్గ సభ్యుడు పాపయ్యగౌడ్

మహేశ్వరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేయనున్న ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను కలపాలని బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్యగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మహేశ్వరంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు తెల్లమల్ల యాదీష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్యూచర్ సిటీకి ఆనుకొని ఉన్న మహేశ్వరం మండలాన్ని కలపకుండా దూరంగా ఉన్న గ్రామాలను ఎలా పరిగణనలోకి తీసుకుంటారని ఆయన ప్రశ్నించారు. వ్యవసాయం చేసుకునే రైతుల భూములను అనుమతి లేకుండా సేకరిస్తే మాత్రం బీజేపీ ఊరుకోదన్నారు. ఇప్పటికే ఫార్మాసిటీ కోసం వేల ఎకరాల భూమిని సేకరించారని, ఇంకా భూములు ఎందుకని ప్రశ్నించారు. అభివృద్ధికి బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకం కాదని, కానీ అభివృద్ధి పేరుతో పేదల భూములను సేకరించి బడా వ్యాపారులకు దోచి పెడితే మాత్రం బీజేపీ చూస్తూ ఊరుకోదన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు అనంతయ్య గౌడ్, మిద్దె సుదర్శన్‌రెడ్డి, పి. సుదర్శన్‌యాదవ్, కుండె వెంకటేష్, మాదవాచారి, శ్రావణ్, వెంకటేష్‌గౌడ్, రవిందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామీణ క్రికెట్ అభివృద్ధే టీడీసీఏ లక్ష్యం

- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర


మాట్లాడుతున్న ఎంపీ వద్ది రాజు రవిచంద్ర

శంషాబాద్ రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో గ్రామీణ క్రికెట్ అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (టీడీసీఏ) కృషి చేస్తుందని రాజ్యసభ సభ్యుడు వద్ది రాజు రవిచంద్ర అన్నారు. మున్సిపల్ పరిధిలోని తొండుపల్లిలో అమెరికా అండర్-17 యూత్ అకాడమీ జట్టు(ఏవైసీఏ)తో టీడీసీఏ నిర్వహిస్తున్న వన్డే టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నోఏళ్లుగా గ్రామీణ క్రికెటర్ల అభ్యున్నతి కోసం కష్టపడుతున్న టీడీసీఏ వ్యవస్థాపక చైర్మన్ శాట్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో ఏవైసీఏ అధ్యక్షుడు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



చేపల మార్కెట్లు ఎక్కడ?
విక్రయాలకు ఇబ్బంది పడుతున్న మత్స్యకారులు
చెరువులు, ఇంటి పరిసరాల్లో అమ్మకాలు 7

పరిహారంపై తర్జనభర్జన

కొలిక్కిరాని పెంజర్ల అసైన్డ్ భూముల సేకరణ

- రెండు సార్లు ప్రజాభిప్రాయసేకరణ
- పరిహారంపై తగ్గేదేలె అంటున్న రైతులు
- గ్రామంలో 118 ఎకరాల ప్రభుత్వ భూమి


పెంజర్ల గ్రామ శివారులో అసైన్డ్ భూములు

కొత్తూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): భూమిలేని నిరుపేదలకు 50ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం భూమిని అసైన్డ్ చేసింది. రెండు వందల మందికి పైగా రైతులు ఆ భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఆ అసైన్డ్ భూమిపై గత ప్రభుత్వం కన్నుపడింది. పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం టీజీఐఐసీకి ఆ భూమిని అప్పగించాలనే నిర్ణయానికి వచ్చింది. దాంతో 2022 సంవత్సరంలో గ్రామంలో అసైన్డ్ రైతులతో అప్పటి రెవెన్యూ అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ కూడా చేశారు. వ్యవసాయం చేసుకొని జీవనం కొనసాగిస్తున్నామని, భూములను అప్పగించే పరిస్థితి లేదని అసైన్డ్ రైతులు తేల్చిచెప్పారు. అప్పటికే అసెంబ్లీ ఎన్నికలు రావడం.. ప్రభుత్వం మారడంతో భూసేకరణ వాయిదా పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత ఇటీవల తిరిగి రెవెన్యూ అధికారులు పెంజర్ల గ్రామంలో భూసేకరణ, పరిహారంపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. తమకు సరైన న్యాయం జరిగితే తప్పా భూములను అప్పగించమని రైతులు స్పష్టం చేశారు. దాంతో అధికారులు

మిగతా 8వ పేజీలో...

ఎకరానికి రెండు కోట్లు ఇవ్వాలి



ప్రభుత్వం అసైన్డ్ భూములు తీసుకోవాలంటే ఎకరాకు రూ.2కోట్లు పరిహారం ఇవ్వాలి. పరిశ్రమలో ఉద్యోగం, ఇళ్లు కట్టుకోవడానికి ప్లాటు ఇవ్వాలి. ఏళ్ల తరబడి తాతలు, దండ్రుల నుంచి వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాం. ప్రభుత్వం స్పందించాలి.

ఎక్కలగారి దేవేందర్, రైతు, పెంజర్ల

రైతులను అన్నివిధాలా ఆదుకోవాలి



భూములు కోల్పోతున్న అసైన్డ్ రైతులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలి. రెండువందల మందికిపైగా నిరుపేద రైతులు ఎన్నో ఏళ్లుగా వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. మరికొందరు పశువులు, మేకలు మేపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం నిరుపేద రైతులను దృష్టిలో పెట్టుకుని తగిన స్థాయిలో న్యాయం చేయాలి.

ఎర్రోళ్ల జగన్, కాంగ్రెస్ నియోజకవర్గ ఎస్సీ సెల్ సీనియర్ నాయకుడు, పెంజర్ల

ఆరోన్ ఆసుపత్రిలో నకిలీ బాగోతం!

- ఫోర్జరీ కేసులో ఆసుపత్రి యజమాని అరెస్ట్
- ఫేక్ డాక్యుమెంట్ సబ్మిట్ చేసిన ఆసుపత్రికి డీఎంహెచ్‌వో నోటీసులు
- ఫోర్జరీ కేసులో ఆసుపత్రి యజమాని ఏలియమ్మ సెబాస్టియన్ అరెస్ట్
- నార్సింగి పీఎస్‌లో పలు సెక్షన్ల కింద వేర్వేరుగా రెండు కేసుల నమోదు
- డాక్యుమెంట్ నకిలీ అని తేలితే ఆసుపత్రి సీజ్ చేస్తాం : డీఎంహెచ్‌వో

రంగారెడ్డి అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నార్సింగి ఆరోన్ ఆసుపత్రి యజమాని నకిలీ బాగోతం వెలుగు చూసింది. ఫేక్ డాక్యుమెంట్ సమర్పించి ఏకంగా డీఎంహెచ్‌వోనే బురిడీ కొట్టించారు. నకిలీ డాక్యుమెంట్ సమర్పించి ఆసుపత్రిని రెన్యూవల్ చేయించారు. ఫేక్ డాక్యుమెంట్ సమర్పించిన ఆసుపత్రి యజమాని ఏలియమ్మ సెబాస్టియన్‌ను నార్సింగి పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లాలో తీవ్ర కలకలం రేపిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి.

కొన్నేళ్ల క్రితం ఇతర రాష్ట్రం నుంచి వచ్చిన ఏలియమ్మ సెబాస్టియన్ నార్సింగి సమీపంలో స్థిరపడింది. స్థానికంగా నార్సింగిలోని మెయిన్ చౌరస్తాలో ఆరోన్ పేరిట ఆసుపత్రిని ఏర్పాటు చేసింది. మహ్మద్ గౌసుద్దీన్‌కు చెందిన బిల్డింగ్‌ను ఆసుపత్రి యజమాని పదేళ్ల పాటు (2010-2021) అద్దెకు తీసుకుంటున్నట్లు అగ్రిమెంట్ రాసుకుంది. కొంతమంది డాక్టర్లతో ఆరోన్ ఆసుపత్రి కొనసాగుతుంది. బిల్డింగ్ యజమాని మహ్మద్ గౌసుద్దీన్ 2022 నవంబరు 5వ తేదీన అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బిల్డింగ్ యజమాని కుటుంబీకులకు తెలియకుండా ఆసుపత్రి యజమాని ఫేక్ డాక్యుమెంట్ సృష్టించింది. బిల్డింగ్ యజమాని తనకు మరో ఏడేళ్ల పాటు బిల్డింగ్ రెంటుకు ఇచ్చినట్లు నకిలీ పత్రాలను తయారు చేసింది. ఆ నకిలీ పత్రాలను జిల్లా వైద్యాధికారికి సమర్పించి ఆసుపత్రిని రెన్యూవల్ చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న బిల్డింగ్ యజమాని దివంగతులు మహ్మద్ గౌసుద్దీన్ కుమార్తె సనా ఫాతిమా ఆసుపత్రి యజమాని ఆడుతున్న నాటకానికి అడ్డుకట్ట వేయాలనుకుంది. జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో సమాచారం హక్కు చట్టం కింద ఆసుపత్రి రెంటు, రెన్యూవల్ తేదీల వివరాలకు సంబంధించిన పత్రాలను సేకరించింది. అనంతరం ఆ పత్రాలతో ఆమె హైకోర్టును ఆశ్రయించింది. 2024 మే 24న ఆసుపత్రి యజమానిపై నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు (ఎఫ్ఐఆర్ నెంబర్ 646/2024, మే-24 420,427,అండ్ 506 ప్రకారం) కేసు నమోదు చేశారు. తర్వాత మరోసారి 2025 ఫిబ్రవరి 24లో ఫిర్యాదు చేయగా (ఎఫ్ఐఆర్ నెంబర్ 364-2025 ప్రకారం ఐపీసీ సెక్షన్ 406,420,465,467,468,471 ఐపీసీ ప్రకారం) కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు సోమవారం ఆరోన్ ఆసుపత్రి యజమాని ఏలియమ్మ సెబాస్టియన్ అరెస్ట్ చేసి నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఫేక్ డాక్యుమెంట్ సబ్మిట్ చేసిన ఆరోన్ ఆసుపత్రికి డీఎంహెచ్‌వో నోటీసులు జారీ చేశారు. డాక్యుమెంట్ నకిలీ అని తేలితే ఆసుపత్రిని సీజ్ చేయనున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు.


ఆసుపత్రి యజమానిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి


ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

శంషాబాద్ రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపాలిటీ లోని 10,11 వార్డుల్లో అభివృద్ధి పనులకు మరిన్ని నిధులు కేటాయించాలని స్థానికులు కోరారు. సోమవారం ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను దూడల వెంకటేశ్ గౌడ్, పారేపల్లి శ్రీనివాస్‌గౌడ్, పెదిరిపాటి ప్రవీణ్‌గౌడ్, దొడ్డి పెంటయ్య, కొండ దర్శన్, రాచమల్ల విశ్వనాథం, సుధాకర్, నాగరాజు తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. వార్డుల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారన్నారు.

ఈదురుగాలులతో వాన

● కూలిన చెట్లు, సూచికబోర్డులు ● పంటలు ఆగమాగం

కొడంగల్/బొంరాస్‌పేట్/ దుద్యాల/కోట్‌పలి/మోమిన్‌పేట్ మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నాలుగో రోజూ సోమవారం వికారాబాద్ జిల్లాలో అక్కడక్క భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కొడంగల్ పట్టణ శివారులోని హైదరాబాద్-బీజాపూర్ మార్గంలో ఉన్న సూచిక బోర్డు ఒక్కసారిగా కిందపడిపోయింది. ఆసమయంలో రోడ్డుపై వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో రెండు కిలో మీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎస్సై జీవీ.సత్యనారాయణ పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకొని క్రేన్, జేసీబీ సహాయంతో సూచిక బోర్డును రోడ్డుపై నుంచి పక్కకు తొలగించారు. కొడంగల్ బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన షెడ్డు కూలిపోయింది. కొడంగల్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈదురుగాలులు, వడగండ్ల వర్షానికి పలు గ్రామాల్లో చెట్లు నేలకొరిగాయి. బొంరాస్‌పేట్ మండలంలో వడగండ్ల వర్షం కురిసింది. వడిచర్ల గ్రామంలో గోపాల్‌రెడ్డికి చెందిన రేకుల షెడ్డు ఈదురుగాలులకు లేచిపోయింది. ఎన్కెపల్లి, కొత్తూర్, మహంతీపూర్, రేగడిమైలారం గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. అకాల వర్షంతో వరి పంటలకు నష్టం వాటిల్లింది. దుద్యాల మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కురిసిన అకాల వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. చిలుముల్‌మైలారంలో వచ్చిన వడగళ్ల వానకు చేతికొచ్చిన పంటలు నేలకొరిగాయి. ఓ చోట చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడింది. వరి, మామిడి తోటలు బాగా దెబ్బతిన్నాయి. కోట్‌పల్లి మండల కేంద్రంలో కురిసిన వానకు కూరగాయల సంత ఆగమాగమైంది.

రైతులను ఆదుకుంటాం: మర్పల్లి ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

మోమిన్‌పేట్ మండలంలో ఇటీవల కురిసిన వడగండ్ల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఎన్కతల, మేకవనంపల్లి, రామ్‌నాథ్‌గూడుపల్లి తదితర గ్రామాల్లో వర్షానికి దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు.


కొడంగల్: హైదరాబాద్-బీజాపూర్ రోడ్డుపై కూలిన సూచిక బోర్డు


దుద్యాల్ : ఎంపీడీవో కార్యాలయం ఎదుట విరిగిన చెట్టు


కోట్‌పల్లి : వర్షానికి రోడ్డుపాలైన కూరగాయలు


ఉల్లిపంటను పరిశీలిస్తున్న మహేందర్‌రెడ్డి


వడిచర్లలో వడగండ్ల వర్షం

గుడిసెలు వేసుకున్న పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి

- ఎమ్మెల్యే యాదయ్యను కోరిన సీపీఐ నాయకులు

చేవెళ్ల, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల పట్టణ కేంద్రంలోని సర్వే నెంబర్ 75 ఉన్న ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి, ప్రభులింగం తెలిపారు. సోమవారం చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య నివాసంలో ఆ పార్టీ నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 75లో పేదలు గుడిసెలు వేసుకుని అందులోనే జీవనం సాగిస్తున్నారని చెప్పారు. ఆ పేదలకు ఇళ్ల పట్టాలు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సత్తిరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్లసత్యనారాయణచారి, అంజయ్య కృష్ణగౌడ్, మంజుల ఉన్నారు.

క్షయ రహిత జిల్లాగా మారుస్తాం

తాండూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది నాటికి క్షయ రహిత జిల్లాగా మారుస్తామని వికారాబాద్ డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో రవీందర్ యాదవ్ వెల్లడించారు. తాండూరులో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఏర్పాటు చేసిన ర్యాలీ, ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పరిశ్రమల్లో కార్మికులకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. క్షయ వ్యాధి రాకుండా 18-60ఏళ్ల వారికి ఏప్రిల్ మొదటి వారంలో వ్యాక్సీన్ పంపిణీ చేపడుతామని ఆయన వివరించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 340 మంది రోగులను గుర్తించి మందులు అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సమీఉల్లా, డాక్టర్ గిరిధర్, అంబికా, రవికుమార్, హర్షవర్ధన్‌రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ పాల్గొన్నారు.


పారా క్రీడల్లో సత్తాచాటిన నేత్ర విద్యాలయం విద్యార్థులు

పారా క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

శంషాబాద్ రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ వేదికగా జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈనెల 21 నుంచి 23 వరకు జరిగిన 2వ ఖేలో ఇండియా-2025 పారాక్రీడల్లో శంషాబాద్ మండలంలో శ్రీ చిన్నజీయర్‌స్వామి ఆధ్వర్యంలో కొనసాగుతున్న నేత్ర విద్యాలయం విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఇండియా స్పోర్ట్స్ ఆథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు 10పతకాలు సాధించాయి. అందులో 7పతకాలను నేత్ర విద్యాలయం విద్యార్థులు సాధించడం విశేషం. పాఠశాలకు చెందిన లలిత 200 మీటర్లు, రవని 100 మీటర్లు, లలిత 400 మీటర్లు, రవని 200 మీటర్లు, శిరీష 100 మీటర్ల పరుగు పందెంలో సత్తా చాటి బంగారు పతకాలు సాధించారు. అదే విధంగా విద్యార్థి అంబటి స్వరాజ్ లాంగ్‌జంప్‌లో రజత పతకాన్ని సాధించాడు. పాఠశాల యజమాన్యం విద్యార్థులను అభినందించింది.



నేల వాలిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ

పంట నష్టపోయిన రైతులకు పరిహారమందేలా చూస్తాం

మాడ్గుల, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఈదురు గాలులు, వర్షంతో శనివారం పెద్ద మాడ్గుల, ఇర్విన్, ఆర్కపల్లి, అన్నెబోయినిపల్లి, బ్రాహ్మణపల్లి తదితర గ్రామాలు, తండాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లింది. సోమవారం ఆయా గ్రామాల్లో ఆమనగల్-1 వ్యవసాయ సంచాలకులు శోభారాణి, ఏవో అరుణకుమారి పంటలను పరిశీలించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 357ఎకరాల మేరకు మొక్కజొన్న పంట నేల వాలిందని, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం సాయం అందేలా కృషి చేస్తామని అధికారులు తెలిపారు. వ్యక్తిగతంగా ప్రతీ రైతు నష్టపోయిన పంటల వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని ఏడీఏ, ఏవో తెలిపారు.

'కాంగ్రెస్ నాయకుడి హత్య తీరని లోటు'

మహేశ్వరం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, న్యాయవాది ఇస్రాయెల్‌ను హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. సోమవారం మహేశ్వరంలో ఇస్రాయెల్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ.. ఇస్రాయెల్‌ను హత్య చేసిన వారిని, వారికి సహకరించిన వారిని ప్రభుత్వం శిక్షించాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. సీనియర్ నాయకుడు హత్యకు గురికావడం తీరని లోటన్నారు. ఇస్రాయెల్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని, వారికి మనోధైర్యాన్ని కల్పించేందుకు నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉండాలని లక్ష్మారెడ్డి సూచించారు. ఇస్రాయెల్ అంత్యక్రియలు మంగళవారం స్వగ్రామం తుమ్మలూరులో జరుగుతాయని, కాంగ్రెస్ శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కేఎల్లార్ కోరారు.



రాజ్‌భూపాల్‌గౌడ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

కేశంపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన రాజ్‌భూపాల్‌గౌడ్‌ను మండల బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. సోమవారం శంషాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలిసిన జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు పసుల నరసింహయాదవ్, జిల్లా సాంస్కృతిక శాఖ కో-కన్వీనర్ నరేందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సురేష్, కుమార్‌గుప్తాలు శాలువాతో సత్కరించారు. పార్టీ బలోపేతానికి కృషిచేయాలని ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వారికి సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీ సత్తాచాటాలన్నారు.



దీక్షలో పాల్గొన్న జేఏసీ నాయకులు

మండల సాధన పోరాటం ఉధృతం

తలకొండపల్లి, మార్చి24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సాధనకు గట్టిప్పలపల్లి వాసులు పోరాటాన్ని ఉధృతం చేశారు. గ్రామస్థులు, సమీప 10 పంచాయతీల ప్రజలు ఏకమయ్యారు. గట్టిప్పలపల్లిని మండలం చేయాలని జేఏసీ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 139వ రోజుకు చేరాయి. జేఏసీ, వివిధ పార్టీల నాయకులు, యువకులు పాల్గొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న కొత్త మండలాల్లో గట్టిప్పలపల్లినీ చేర్చాలని డిమాండ్ చేశారు.

సాగులో ఉన్న రైతులకు పట్టాలు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్

మోమిన్‌పేట్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసారం గ్రామ శివారులోని ఫారెస్టు భూముల్లో ఎన్నో ఏళ్లుగా పంటలను సాగు చేస్తున్న పేద రైతులకు ప్రభుత్వం పట్టాలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులతో కలిసి సోమవారం మోమిన్‌పేట్ మండల కేంద్రంలో తహసీల్దార్ మనోహరచక్రవర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రైతుల భూ సమస్యను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. రైతులు పంట పొలాలకు వెళ్లకుండా దారి మూసి వేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంచర్ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి డబ్బులను కూలీలకు అందించాలన్నారు. పల్లె దవాఖానాకు మరమ్మతులు చేయించి వైద్యుడి నియామకం, కమ్యూనిటీ లైబ్రరీ ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు స్పందించి తహసీల్దార్ సంబంధిత అధికారులతో మాట్లాడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు ఆనందం, స్టాలిన్, మహేందర్, రమేశ్, శ్రీకాంత్, అరుణ్‌కుమార్, కృష్ణ, భాగ్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాయల్టీ చెల్లించని నాపరాతి లారీలపై కేసులు

▸ మైన్స్ ఏడీ సత్యనారాయణ

తాండూరురూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రాయల్టీ పత్రాలు ఉంటేనే నాపరాతి లారీలను రాష్ట్రంలోకి అనుమతిస్తామని లేదంటే కేసులు నమోదు చేస్తామని మైన్స్ ఏడీ సత్యనారాయణ అన్నారు. మండలంలోని జినుగుర్తి గ్రామ శివారులో నాపరాతి గనుల నుంచి నాపరాతిని తీసుకువస్తున్న లోడ్ లారీలపై అధికారులు తనిఖీలు నిర్వహించారు. మైన్స్ ఏజీ (అసిస్టెంట్ జియాలజిస్ట్) నాగరాజు, మైన్స్ ఆర్‌ఐ నిర్మల సిబ్బందితో కలిసి సోమవారం సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో జినుగుర్తి నుంచి వస్తున్న నాపరాతి లారీలను తనిఖీ చేశారు. అయితే అట్టి లారీలు కర్ణాటకలోని మిర్యాణ్ నాపరాతి గనుల నుంచి నాపరాతి లోడ్‌తో వస్తున్నట్లు అధికారులు ధ్రువీకరించారు. వాటిని తనిఖీలు నిర్వహించగా 16 లారీలకు రాయల్టీలకు సంబంధించిన కాగితాలు ఉండటంతో వదిలేశారు. మరో 8లారీలకు రాయల్టీ పత్రాలు లేకపోవడంతో వాటిని కరన్‌కోట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే మైన్స్ అధికారులు తనిఖీ చేస్తున్న సమయంలో కరన్‌కోట్ పోలీసు స్టేషన్ నుంచి ఏఎస్‌ఐతో పాటు కొంతమంది పోలీసుల సమక్షంలోనే తనిఖీ చేసినట్లు తాండూరు మైన్స్ ఏడీ తెలిపారు. రాయల్టీలు లేని ఎనిమిది లారీలను కరన్‌కోట్ పోలీసులకు అప్పగించినట్లు మైన్స్ అధికారులు తెలిపారు. వీటిపై మంగళవారం(నేడు) పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. వారి వెంట మైన్స్ సిబ్బంది మధు, ప్రవీణ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం మాజీ జెడ్పీటీసీ ఎం.మాలతికృష్ణారెడ్డి ముస్లింలకు చేవెళ్లలోని పద్మావతి కన్వెన్షన్‌లో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ విందుకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా వచ్చారు. రంజాన్ సందర్భంగా ముస్లింలకు ఇఫార్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.కృష్ణయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బల్వంతరెడ్డి, వసంతం, ఎం.యాదగిరి, బాసిత్, మోసిన్, జాఫర్, శ్రీనివాస్, ఆసిఫ్, సలీం, తాజుద్దీన్, నషీర్, చోటు, ఇబ్రహీం, అక్బర్, కృష్ణ, దయాకర్, సాయికుమార్‌రెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, శేరి శివారెడ్డి, మోహన్‌రెడ్డి ఉన్నారు.

గిట్టుబాటు లేక.. రోడ్డుపై టమాట

గిట్టుబాటు ధర లేకపోవడంతో టమాట రైతులు లబోదిబోమంటున్నారు. మార్కెట్‌లో టమాట ధర దారుణంగా పడిపోవడంతో మంచాల మండల పరిధి అస్మత్‌పూర్‌లో రోడ్డుపైనే టమాటాలను పారబోశారు. టమాట కిలో ధర రూ.3 పలికితే మార్కెట్‌కు తరలించడానికి అయ్యే రవాణా ఖర్చులు రాని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. ధరల నియంత్రణపై ప్రభుత్వం దృష్టిసారించాలని కోరారు.

మంచాల, మార్చి 24(ఆంధ్రజ్యోతి)



చేపల మార్కెట్లు ఎక్కడ?

▸ చెరువులు, ఇంటి పరిసరాల్లో అమ్మకాలు

▸ మార్కెట్లకు నోచుకోని మత్స్యకారులు

మొయినాబాద్ రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల ఉపాధి కోసం గత ప్రభుత్వం చెరువు, కుంటల్లో చేపపిల్లలు పెంచి అమ్ముకునే కార్యక్రమాన్ని నిర్వహించింది. మొయినాబాద్ మండల గ్రామాల్లో 50కిపైగానే కుంటలు, చెరువులున్నాయి. చేపల పెంపకానికి అనుకూలమైనవి 15 ఉన్నాయి. ఈ చెరువుల్లో లక్షలాది చేపపిల్లలను వదిలారు. ప్రస్తుతం అవి పెద్దవై అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. చిలుకూరు, వెంకటాపూర్, అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ గ్రామాల్లో మత్స్యకార సంఘాలున్నాయి. వీటిల్లో ఒక్కదాంట్లో 130 మంది చొప్పున సభ్యులు ఉన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ముదిరాజు, వడ్డెరలు ఉన్నారు. వీరి వృత్తి చేపల వేట. అయితే ఫిష్ కార్పొరేషన్‌లో అన్ని గ్రామాల మత్స్యకారులకు సభ్యత్వాల్లేవు. తమ సొసైటీలను రిజిస్టర్ చేసేందుకు అధికారులు చొరవచూపడం లేదని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. సొసైటీలో సభ్యత్వం ఉంటే ప్రభుత్వ పథకాలు అందుతాయని అంటున్నారు. మండలంలో 28 పంచాయతీల్లో చిలుకూరు, వెంకటాపూర్, అజీజ్‌నగర్ సొసైటీలో మాత్రమే రిజిస్టర్ అయ్యాయి. అమ్డాపూర్, నక్కలపల్లి, ఎన్కేపల్లి గ్రామాల మత్స్యకారులు నైపుణ్య శిక్షణ పొందుతున్నారు.



చిలుకూరులో రోడ్డు పక్కన చేపల విక్రయాలు

మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తేనే..

చేపల దిగుబడి బాగానే ఉంటున్నా మార్కెటింగ్ సౌకర్యం లేక మత్స్యకారులు చెరువుల వద్దనే చేపలు అమ్ముకుంటున్నారు. నియోజకవర్గ కేంద్రాల్లోనూ చేపల మార్కెట్లు లేవు. రోడ్ల పక్కన విక్రయిస్తున్నారు. మార్కెటింగ్ సౌకర్యం కోసం ఫిష్ కార్పొరేషన్‌ను ప్రతిపాదనలు పంపినా ఆమోదం పొందడం లేదు. సొంత స్థలాలు చూసుకుంటే భవన నిర్మాణానికి నిధులు ఇస్తామని అధికారులు చెబుతున్నారని మత్స్యకారులు పేర్కొంటున్నారు. మొయినాబాద్, అజీజ్‌నగర్, చిలుకూరు, హిమాయత్‌నగర్ గ్రామాల్లో ఫిష్ మార్కెట్లు ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుంది. చిలుకూరులో చేపల అమ్మకానికి చిన్న గది ఉన్నా అది సరిపోవడంలేదని, 130మంది సభ్యులున్న గ్రామంలో చేపల అమ్మకానికి ఎకరం స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

అమ్ముకునేందుకు స్థలాలు చూపాలి



ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి తోడ్పాటు ఇస్తోంది. చెరువులు, కుంటల్లో చేపపిల్లలను వదుల్తున్నారు. అయితే చేపల అమ్మకానికి మాకు మార్కెట్ లేదు. విధిలేక ఎక్కడపడితే అక్కడే విక్రయిస్తున్నాం. కొందరం ఇళ్ల ముందే చేపలు అమ్ముకుంటున్నాం. చేపల మార్కెట్ ఉంటే ఎక్కడెక్కడి నుంచో కొనుగోలుదారులు వస్తారు. దీంతో మాకు లాభం వస్తుంది. మండలంలో చేపల విక్రయానికి అన్ని గ్రామాల వారికి కలిపి 5ఎకరాలను కేటాయిస్తే చేపల మార్కెట్ నిర్మించుకుంటాం.

- శ్రీరాములు, జిల్లా మత్స్యకార సంఘం కన్వీనర్

ప్రభుత్వం సౌకర్యాలను కల్పించాలి



చేప పిల్లలు పెద్దగయ్యాక విక్రయించేందుకు స్థలాలు లేవు. ప్రభుత్వం మత్స్యకారులపై దృష్టిసారించాలి. ప్రభుత్వం చేపల విక్రయానికి మార్కెట్ ఏర్పాటు చేస్తే అమ్మకాలు ఎక్కువగా ఉంటాయి. సొసైటీలు, మార్కెట్లు లేక ఇబ్బందులు తప్పడం లేదు. మాకు చేపల విక్రయానికి మండల కేంద్రం, గ్రామాల్లో అనువైన విక్రయస్థలాలను గుర్తించాలి.

- బుర్రకాయల మల్లేశ్, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు

చెట్లు నరికితే చట్టపరమైన చర్యలు

యాలాల, మార్చి 24, (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో చెట్లను నరికితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ధారూర్ అటవీ రేంజ్ అధికారి రాజేందర్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మండలంలోని రాస్నం, గంగసాగర్, సంగా సంగాయిపల్లితండా, పగిడ్యాల్, జుంటుపల్లి, బాకాపూర్, అన్నసాగర్ గ్రామాలకు చెందిన కొందరు రాత్రివేళల్లో అటవీ ప్రాంతంలోకి వెళ్లి ట్రాక్టర్లు, జేసీబీలతో వెళ్లి అక్రమంగా చెట్లను నరికివేస్తున్నారని తెలిపారు. చెట్ల నరికివేత అనంతరం అడవి భూమిలో సాగు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా సంగాయిపల్లిమీదితండా, నడిమితండా, వెనుకతండా, బాణాపూర్ తండా, రాస్నం, గంగసాగర్ గ్రామాలకు చెందిన వారు అలైన్‌మెంట్ పట్టాలు అని ఆర్వోఎఫ్ఆర్ భూముల సాగుతో అడవి భూమిని ఆక్రమించుకుంటున్నాని తెలిపారు. అటవీ ప్రాంతంలో అక్రమసాగు చేసినా, నిప్పు పెట్టినా ఉపగ్రహ ఛాయా చిత్రాల ద్వారా సమాచారం వస్తుందని, సంబంధితవ్యక్తుల వివరాలు తెలుసుకుంటామన్నారు. ఆర్వోఎఫ్ఆర్ భూములను రద్దు చేసేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడవి సంరక్షణకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

ఆకాశమే హద్దుగా!

(ఐదో పేజీ తరువాయి)

జారీ చేసేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టమ్ (టీజీ ఐపాస్) విధానంతో రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. దేశంలోనే ఆదర్శంగా నిలిచిన టీజీ-ఐపాస్‌తో ఆన్‌లైన్ దరఖాస్తుతో అన్నిరకాల అనుమతులు సింగిల్ విండో విధానంలో నెలరోజుల వ్యవధిలోనే ఇస్తున్న విషయం తెలిసిందే. అలాగే కొత్తగా ఏర్పాటు చేసే కంపెనీలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నారు. పారదర్శకంగా అనుమతులు జారీ చేస్తుండడంతో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్యవేత్తలు శివార్లలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిచూపుతున్నారు. ఉమ్మడి జిల్లాలో మౌలిక సదుపాయాలు దండిగా ఉండడంతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పారిశ్రామికవాడల్లో పరిశ్రమలు పెట్టేందుకు ప్రముఖ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. టీజీఐపాస్ అమల్లోకి తెచ్చిన తరువాత ఈ మూడు జిల్లాల్లో రూ.40వేల కోట్ల పెట్టుబడులతో 7532 కంపెనీలు ఏర్పాటయ్యాయి. తద్వారా దాదాపు 3లక్షల మందికిపైగా ఉపాధి అవకాశాలు వచ్చాయి. గడిచిన ఏడాది కాలంలో రూ.6045 కోట్ల పెట్టుబడులతో 448 పరిశ్రమలు నెలకొల్పారు. ఏడాది కాలంలో 16వేల మందికిపైగా ఉపాధి అవకాశాలు కల్పించారు.

20 లక్షల పని దినాలు కల్పించి..

ఉపాధి హామీ పనుల్లో రంగారెడ్డి జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో కూలీలకు 20 లక్షల పనిదినాలు కల్పించి 93.5శాతం లక్ష్యాలను సాధించింది. 92శాతం లక్ష్యాలు సాధించి మేడ్చల్ మూడో స్థానంలో నిలవగా 89.3శాతం లక్ష్యాలు సాధించి వికారాబాద్ 19వ స్థానంలో ఉంది.

2024 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు సరుకుల ఎగుమతులు

జిల్లా	ఎగుమతులు (రూ.కోట్లలో)	రాష్ట్రంలో శాతం
రంగారెడ్డి	41,535	41.43
మేడ్చల్	17,652	17.60

2024-2025 ఆర్థిక సంవత్సరంలో వంట గ్యాస్ కనెక్షన్లు ... ఆయిల్ కంపెనీల వారీగా (లక్షల్లో)

జిల్లా	ఐఓసీఎల్	హెచ్‌పీసీఎల్	బీపీసీఎల్	మొత్తం
రంగారెడ్డి	7.22	5.30	2.41	14.93
మేడ్చల్	5.63	5.30	2.80	13.71
వికారాబాద్	1.26	0.94	0.45	2.65

10 ఏళ్లలో కంపెనీల స్థాపన, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు

జిల్లా	కొత్త కంపెనీలు	పెట్టుబడులు (రూ.కోట్లలో)	ఉపాధి కల్పన
రంగారెడ్డి	1,783	25,602	1,07,002
మేడ్చల్	5,062	13,199	1,24,176
వికారాబాద్	667	1,024	7,266

2024-25లో కంపెనీల స్థాపన, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు

జిల్లా	కొత్తగా ఏర్పాటైన కంపెనీలు	పెట్టుబడులు (రూ.కోట్లలో)	ఉపాధి కల్పన
రంగారెడ్డి	130	5,155	8,857
మేడ్చల్	262	832	6,760
వికారాబాద్	56	58	396

ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలి

▸ అదనపు కలెక్టర్ సుధీర్

▸ 16మందికి కారుణ్య నియామక పత్రాలు అందజేత

వికారాబాద్, మార్చి24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని అదనపు కలెక్టర్, జడ్పీ సీఈవో సుధీర్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ ద్వారా 16 మంది అర్హులకు కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పంచాయతీ రాజ్ శాఖలో ఖాళీలు లేకపోవడంతో చాలాకాలంగా కారుణ్య నియామకాలు చేపట్టలేదన్నారు. ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కలు ప్రత్యేకంగా చొరవ తీసుకొని అటెండర్ పోస్టులను జూనియర్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేసి ఈ నియామకాలను చేపట్టారన్నారు. ఇందులో భాగంగా వికారాబాద్ జిల్లా పరిషత్‌లో మొత్తం 16 మందికి పోస్టింగ్ ఇచ్చామన్నారు. పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందకుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం కారుణ్య నియామకాలు చేపట్టక పోవడంతో కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వచ్చిందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేందర్, జిల్లా పరిషత్ సిబ్బంది చంద్రశేఖర్, వినయ్ కుమార్, బెన్నీ, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



కారుణ్య నియామక పత్రాలను అందజేసి సన్మానించిన జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్



గాలి ద్వారా టీబీ వ్యాప్తి

▸ డీఎంహెచ్‌వో వెంకటరవణ

వికారాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): టీబీ ఒకరి నుంచి మరొకరికి గాలి ద్వారా వ్యాపిస్తుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరవణ తెలిపారు. సోమవారం ప్రపంచ టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వికారాబాద్ పట్టణంలోని రామయ్యగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జ్వరం, తెమడతో కూడిన దగ్గు, దగ్గినప్పుడు రక్తం పడడం, ఆకలి తగ్గిపోవడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కన్పిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించి వైద్యుల సూచనల మేరకు మందుల వాడాలని తెలిపారు. టీబీ రోగి దగ్గినప్పుడు తుమ్మినప్పుడు తుంపర్ల ద్వారా వ్యాధి ఇతరులకు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఆరోగ్య వంతులకు టీబీ వ్యాధి సోకే అవకాశం చాలా తక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ రవీంద్ర యాదవ్ డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ నిఖిల్, డాక్టర్ సృజన్, డాక్టర్ సౌమ్య, వైద్య సిబ్బంది పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ విద్యార్థులకు అంబేడ్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు మే 19 వరకు హెచ్‌టీటీపీఎస్://తెలంగాణ ఈ పాస్.సీజీజీ.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అమెరికా, కెనడా, జర్మనీ, యూకే, సింగపూర్, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో ఉన్నత విద్య కోసం ఈ పథకం ద్వారా రూ.20లక్షల స్కాలర్ షిప్ మంజూరు చేయబడుతుందన్నారు. అభ్యర్థులు డిగ్రీ(సాంకేతిక, వృత్తి కోర్సులు) పూర్తి చేసి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. కుటుంబ ఆదాయం రూ.5లక్షలలోపు ఉండాలని, ఒక్క కుటుంబం నుంచి ఒక్కరే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి వన్ వే ఎకానామి విమాన టికెట్, వీసా చార్జీలు కల్పించబడతాయన్నారు. వివరాలకు షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

వైభవంగా మల్లన్న కల్యాణోత్సవం

మేడ్చల్ టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) మేడ్చల్ మున్సిపాలిటీ పూడూరు మల్లన్న కల్యాణోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతీ సంవత్సరం గ్రామంలో జరుపుకునే ఈ వేడుకల్లో స్థానిక ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. మహిళలు బోనాలతో ఆలయానికి పెద్దసంఖ్యలో విచ్చేశారు. స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొనడానికి వచ్చేసిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొని పూజలు చేశారు.



బోనాలతో మల్లన్న కల్యాణోత్సవంలో పాల్గొన్న మహిళలు

కుల సంఘాలు సమాజ సేవ చేయాలి

మేడ్చల్ టౌన్: కులసంఘాలు తమ కులానికి పరిమితం కాకుండా సమాజ సేవకోసం పాటు పడాలని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపల్ పూడూరులో సోమవారం రూ.16లక్షలతో నిర్మించిన యదవ సంఘం భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జగన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బాబు యాదవ్ పాల్గొన్నారు.

సమయానికి రాని డాక్టర్లు

● రోగుల ఇబ్బందులు

షాబాద్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు షాబాద్ పీహెచ్‌సీలో వసతులు ఉన్నా డాక్టర్ల నిర్లక్ష్యంతో ప్రజలకు సరైన వైద్యం అందడం లేదు. షాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు సమయానికి రాక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లున్నారు. సోమవారం ఉదయం 11:30 వరకు ఒక్క డాక్టరూ రాలేదు. స్టాఫ్‌నర్స్ మాత్రం రోగులను చూసి మందులిచ్చి పంపించారు. డాక్టర్‌తో వైద్యం చేయించుకునేందుకు వస్తే నర్సు చికిత్సతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోందని, బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిన వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం, ప్రత్యేక మందులు అందించాల్సి ఉంటుందని రోగులు అన్నారు. నిపుణులైన వైద్యులు చూస్తేనే సరైన చికిత్స అందుతుందని, అలాంటిది వైద్యం కోసం గ్రామాల నుంచి వచ్చే తమకు నర్సు ఇచ్చే గోలిలతోనే ఎలా నయం అవుతుందని వాపోతున్నారు. ఈ మాత్రం వైద్యం తమకు స్థానిక ఆర్ఎంపీ వద్దయినా దొరుకుతుందన్నారు. మండల కేంద్రంలోనే ఇలా ఉంటే ఇక గ్రామీణ ప్రాంతాల్లో సబ్ సెంటర్లలో వైద్యం ఎలా ఉంటుందోనని చర్చించుకున్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు సమస్యలకు నిలయాలుగా మారాయని అన్నారు. డాక్టర్లు సమయపాలన పాటించి రోగులకు వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.


డాక్టర్ రాక ఖాళీగా ఉన్న కుర్చీ


డాక్టర్ కోసం వేచి చూస్తున్న రోగులు


రోగులకు మందులు రాస్తున్న స్టాఫ్‌నర్సు

పీసీసీ చీఫ్‌ను కలిసిన ఎమ్మెల్యే


పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. నగరంలోని మహేశ్‌కుమార్‌గౌడ్ నివాసంలో సోమవారం శంకర్‌పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపాల్‌రెడ్డి, చంద్రమౌళి, రఘునందర్‌రెడ్డిలతో ఎమ్మెల్యే కలిశారు. వారు పీసీసీ చీఫ్‌కు ఫ్లవర్ బొకే ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మానించారు.

కూరగాయల సాగుతో లాభాలు

యాచారం, మార్చి24(ఆంధ్రజ్యోతి): పట్టుపరిశ్రమ, కూరగాయల సాగుతో రైతులు ఆర్థికంగా లబ్ధిపొందొచ్చని రంగారెడ్డి జిల్లా ఉద్యానవన శాఖ ప్రాజెక్టు అధికారి సురేష్ అన్నారు. సోమవారం చౌదర్‌పల్లి, మొండిగౌరెల్లి, గడ్డమల్లయ్యగూడ రైతులను షాద్‌నగర్ మండలం కొరితకుంటాతండా, చిట్టియాల గ్రామాల్లో సాగు చేస్తున్న మల్బరీతోటలు, కూరగాయ పంటల పరిశీలనకు తీసుకువెళ్లారు. ఉద్యానవన శాఖ అధికారులు తమకు సూచనలు చేశారని, తక్కువ పెట్టుబడి అయ్యే పంటలపై వివరించారని రైతులు చెప్పారు. యాచారం మండలంలో కూరగాయలు, ఆకుకూర, ఇతర వాణిజ్య పంటల సాగుపై రైతులకు మెలకువలు నేర్పుతామని పీడీ సురేష్ చెప్పారు.


మల్బరి తోటను పరిశీలిస్తున్న రైతులు

కతాన్ చెరువును పరిశీలించిన అధికారులు


ఇరిగేషన్ డీఈ‌ఈ చెన్నకేశవరెడ్డికి వినతిపత్రమిస్తున్న సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధి పోల్కంపల్లిలోని కతాన్‌చెర్వు కట్టను కొందరు తొలగించినట్లు వచ్చిన ఫిర్యాదుతో సోమవారం ఇరిగేషన్ డీఈ‌ఈ చెన్నకేశవరెడ్డి, ఏఈ‌ఈ హరిత పరిశీలించారు. మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ, జిల్లా అధ్యక్షుడు చెనమోని శంకర్, స్థానిక సొసైటీ అధ్యక్షుడు కావలి లక్ష్మయ్య మాట్లాడుతూ.. పురాతన కతాన్‌చెరువు కట్టను తొలగించి కాలువను కబ్జాచేశారంటూ వివరించారు. చెరువులో నీరుంటే మత్స్యకారుల కుటుంబాలు చేపలు పట్టుకుని జీవనాధారం పొందుతాయన్నారు. కొందరు చెరువు కట్టను తొలగించి చెరువు ఆనవాళ్లు లేకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, కబ్జాదారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై రికార్డులను పరిశీలించి కట్ట, కాలువలు కబ్జాకు గురైనట్లు తేలితే చట్టపరంగా తగు చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ డీఈ‌ఈ చెన్నకేశరెడ్డి తెలిపారు.

మండలాన్ని హరిత గ్రామంగా తీర్చి దిద్దుదాం


నర్సరీని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

యాచారం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రతీ గ్రామంలో మొక్కలు నాటి వృక్షాలుగా మార్చి హరితమండలంగా తీర్చి దిద్దుదామని ఎంపీడీవో జి.నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం యాచారంలోని నర్సరీని తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు సలహాలు చేశారు. కూలీలకు వారవారం వేతనాలందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నర్సరీలో మొక్కలు ఎండకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఏపీవో లింగయ్య తదితరులు ఉన్నారు.

పన్ను వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

● ఆమనగల్లు మునిసిపల్ కమిషనర్ శంకర్‌నాయక్

ఫేస్ టు ఫేస్



ఆమనగల్లు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నులను ప్రజలు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడాలని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ అన్నారు. సోమవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. వంద శాతం పన్ను వసూళ్లకు బిల్ కలెక్టర్లు, మున్సిపల్ సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పలు అంశాలపై వివరాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: ఆమనగల్లు మున్సిపాలిటీలో ఇంటి పన్నుల వసూళ్ల ఎంత డిమాండ్ ఉంది?

కమిషనర్: మున్సిపాలిటీ 15 వార్డుల్లో 2024-25 సంవత్సరానికి పాత బకాయిలతో కలుపుకొని రూ.2.21కోట్లు డిమాండ్ ఉంది.

ఆంధ్రజ్యోతి: ఇప్పటి వరకు పన్నులు వసూళ్ల ఎంత చేశారు?

కమిషనర్: సిబ్బంది కొరవతో ఇప్పటి వరకు రూ1.16కోట్లు పన్ను వసూళ్ల చేశాం. డిమాండులో 56 శాతం వసూళ్ల చేశాం. మరో 44శాతం పన్నుల వసూళ్లకు ఉదయం 7నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: పన్ను వసూళ్లకు గడువెప్పటి వరకు?

కమిషనర్: మార్చి 31 వరకు వంద శాతం ఇంటి పన్నులు వసూళ్ల చేయాలని ప్రభుత్వం గడువు విధించింది. ఆ దిశగా వసూళ్లకు చర్యలు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: పన్ను చెల్లించని వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

కమిషనర్: ఇంటి పన్నుల బకాయిలు పేరుకుపోయిన వారికి ఇప్పటికే నోటీసులు అందజేశాం. విధించిన గడువులోపు చెల్లించకపోతే చర్యలుంటాయని వారికి తెలియపరుస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పన్ను వసూళ్లలో ఎలాంటి ఇబ్బందులొస్తున్నాయి?

కమిషనర్: తల్లిదండ్రుల పేరిట ఉన్న ఇళ్లను కుమారులు మ్యుటేషన్ చేయించుకోక పన్ను కట్టడం లేదు. బకాయిల చెల్లింపునకు జాప్యం చేస్తున్నారు. మ్యుటేషన్ చేయించుకోవాలని సూచిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పట్టణంలో ఎల్ఆర్ఎస్‌కు ఎన్ని దరఖాస్తులొచ్చాయి?

కమిషనర్: మునిసిపల్ పరిధిలో ఎల్ఆర్ఎస్‌కు 3,567 దరఖాస్తులొచ్చాయి. వాటిల్లో 2,400 అర్హమైనవిగా గుర్తించాం.

ఆంధ్రజ్యోతి: ఎంత మంది రెగ్యులరైజ్ చేయించుకున్నారు?

కమిషనర్: మున్సిపాలిటీలో ఎల్ఆర్ఎస్‌పై ప్రత్యేక ఫోకస్‌పెట్టాం. 25% రిబేట్‌పై ఇప్పటి వరకు 200మంది క్రమబద్ధీకరించుకున్నారు.

ఆంధ్రజ్యోతి: ఎల్ఆర్ఎస్ పేమెంట్‌కు ఎంత వరకు గడువుంది?

కమిషనర్: ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ప్లాట్లు, లే అవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం 25శాతం రిబేటుతో ఈ నెల 31వ తేదీ వరకు గడువు ఇచ్చింది. ఈ లోగా కట్టుకోవాలి.

హైదరాబాద్‌కు తరలకుండా ఆశా కార్యకర్తల అరెస్ట్


తలకొండపల్లి : పోలీస్‌స్టేషన్‌లో ఆశా కార్యకర్తలు, నాయకులు


ఆశాలను అరెస్ట్ చేసిన కొత్తూర్ పోలీసులు

తలకొండపల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): డిమాండ్ల పరిష్కారానికి ఆశా కార్యకర్తలు సోమవారం తలపెట్టిన చలో హైదరాబాద్ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. హైదరాబాద్‌లోని కమిషనరేట్ వద్ద ఏర్పాటు చేసిన ధర్నాకు ఆశాలు, సీఐటీయూ నాయకులు తరలకుండా చర్యలు తీసుకున్నారు. తెల్లవారు జామునే కార్యకర్తలు, సంఘాల నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్లకు తరలించారు. అరెస్ట్ చేసిన పది మంది ఆశా కార్యకర్తలను సాయంత్రం విడుదలచేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఆశా కార్యకర్తలకు రూ.18వేల వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య అన్నారు. కార్యక్రమంలో నాయకులు, ఆశాలు శిరీష, సుజాత, నర్సమ్మ, చంద్రకళ ఉన్నారు.

కొత్తూర్: చలో కమిషనర్ ఆఫీస్‌కు తరలకుండా పోలీసులు ఆశాలను అరెస్ట్ చేశారు. ఈ అరెస్ట్‌లను సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబ ఖండించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నేరవేర్చాలని అయన డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో శ్రీవాణి, కమల, కవిత, జయమ్మ, శిరీష ఉన్నారు.

చేవెళ్ల: ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి దేవేందర్ అన్నారు. ఆశకార్యకర్తలు హైదరాబాద్ వెళ్లకుండా పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వం అరెస్టు చేయడం దారుణమని, అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని నాయకులు అన్నారు. అరెస్టయిన వారిలో విజయలక్ష్మి, సైదమ్మ, కవితి, అలివేలు, లావణ్య ఉన్నారు.

శంకర్‌పల్లి: ఆశాలకు నెలకు రూ.18వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు నాగమణి, భవానీ డిమాండ్ చేశారు. ఆశాల అరెస్టును వారు ఖండించారు.

షాబాద్: ఆశా వర్కర్ల అరెస్టు సరికాదని సీఐటీయూ మండల నాయకుడు శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాప్రభుత్వం అని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు.

కేశంపేట: తమ డిమాండ్ల సాధనకు హైదరాబాద్ వెళ్తున్న ఆశా కార్యకర్తలు, వీఆర్ఏలను అరెస్ట్ చేశామని సీఐ నరహరి తెలిపారు. ఆశా కార్యకర్తలు, వీఆర్ఏలు వేర్వేరుగా అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్నట్లు సమాచారం రావడంతో అరెస్ట్ చేశామని తెలిపారు. ఆశా కార్యకర్తలు సర్వస్వతి, వసంత, అనిత, సంతోష, వీఆర్ఏలు శ్రీకాంత్, శ్రీనివాస్, ఢిల్లీ నర్సింలు, లింగం, బాల్‌రాంలను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు.


చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో ఆశా కార్యకర్తలు


కేశంపేట పీఎస్‌లో ఆశాలు


శంకర్‌పల్లి పోలీసుల అదుపులో ఆశా వర్కర్లు

కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ రవి


మంత్రి రామ్మోహన్ నాయుడుతో మల్లు రవి

ఆమనగల్లు, మార్చి24(ఆంధ్రజ్యోతి): కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడును సోమవారం నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి మర్యాద పూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని కేంద్ర మంత్రి కార్యాలయంలో రామ్మోహన్‌నాయుడును కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వ పరంగా తోడ్పాటు ఇవ్వాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ రవి తెలిపారు.

ఖర్గేను కలిసిన ఎంపీ మల్లు ..

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేను నాగర్‌కర్నూల్ ఎంపీ రవి కలిశారు. ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో పలువురు ఎంపీలతో ఖర్గేను కలిసి సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పార్టీ అధినేతకు వివరించామని రవి తెలిపారు. అలాగే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదంపై వివరించినట్లు చెప్పారు.

ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడిని కలిసిన ఫరీద్



ఆమనగల్లు, మార్చి24(ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వరుణ్‌చౌదరిని సోమవారం ఆమనగల్లుకు చెందిన ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి ఫరీద్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రితీశ్‌రావుతో ఢిల్లీలో వరుణ్ చౌదరిని కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. యూనియన్ కార్యక్రమాలను వివరించామని ఫరీద్ తెలిపారు.

యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడికి సత్కారం



కడ్తాల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు ఉదయ్‌భాను చిబ్‌ను సోమవారం కల్వకుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని యువజన కాంగ్రెస్ కార్యాలయంలో ఉదయ్‌భానును కలిసి పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించినట్లు షాబుద్దీన్ తెలిపారు.

కేసీఆర్‌ను విమర్శిస్తే ఖబడ్దార్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హఫీజ్

చౌదరిగూడ, మార్చి 24(ఆంధ్రజ్యోతి):50ఏళ్ల కాంగ్రెస్ పాలనలో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులపై ఎందుకు గుర్తుకు రాలేదని, మాజీ సీఎం కేసీఆర్ ఆలోచనతోనే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం కార్యరూపం దాల్చిందని జిల్లేడ్ చౌదరిగూడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు హఫీజ్ అన్నారు. సోమవారం బీఆర్ఎస్ మండల కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం లాల్‌పహాడ్ సభలో షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, నాయకులు కేసీఆర్ పాలనకాలంలో మండలంలో అభివృద్ధే జరగలేదని అనడం సరికాదన్నారు. కేసీఆర్‌ను విమర్శిస్తు ఖబడ్దార్ అని హెచ్చరించారు. రిజర్వాయర్ గురించి మాజీ సీఎం ఎంత కృషిచేశారో ఇంజినీర్లను అడిగి తెలుసుకోవాలన్నారు. రిజర్వాయర్‌ను ఎత్తైన ప్రదేశంలో నిర్మిస్తే అన్ని ప్రాంతాలకు నీరందుతుందని కేసీఆర్ గుర్తించారని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో నార్లపూర్, ఎదుల, వట్టెం, కరివేన ఉదాండపూర్‌లో 90శాతం పనులు పూర్తి అయ్యాయని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో పనులు సాగడం లేదన్నారు. మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు బాబురావు, వెంకటేశ్, జబ్బార్, యాదయ్య, జహంగీర్, మోత్యా, మల్లేష్, రాములు,గణేష్, రాజు, సత్యం, అమీర్, మురళి, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సేవలను బట్టే సమాజంలో కీర్తి


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దశరథ్‌నాయక్, పాల్గొన్న నాయకులు

కడ్తాల్, మార్చి24(ఆంధ్రజ్యోతి): సేవలను బట్టే సమాజంలో కీర్తి లభిస్తుందని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేం టదర్ అన్నారు. కడ్తాలలోని ప్రజాచౌక్ వద్ద వివేకానందయూత్, యువజన సంఘాల రాష్ట్ర ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం ప్రజా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా ముఖ్యఅతిథిగా దశరథ్ హాజరై ప్రారంభించారు. సేవా కార్యక్రమాల్లో యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు పాలుపంచుకోవాలన్నారు. వేసవి నేపథ్యంలో విద్యుత్, తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, యువకులు వెంకటేశ్, కంబాల పరమేశ్, లాయక్ అలీ, జహంగీర్ బాబ, అశోక్‌కుమార్, సందీప్‌రెడ్డి, గోపీకృష్ణ, వెంకటేశ్, గణేశ్, నాగరాజు, చంద్రశేఖర్, మహేశ్, రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలి

కేశంపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మించాలని, ప్లాస్టిక్ బదులుగా ప్రత్యామ్నాయ వస్తువులు వాడేలా ప్రజలకు అవగహన కల్పించాలని షాద్‌నగర్‌లోని ఎస్టీ గురకుల కాలేజీ విద్యార్థులు అన్నారు. పాపిరెడ్డిగూడలో సోమవారం విద్యార్థులు జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో చెత్తను తొలిగించారు. విద్యార్థులకు ప్లాస్టిక్ వాడకంపై అవగహన సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేసి వాడుకోవాలని సూచించారు. వాడిన ప్లాస్టిక్ పెన్నులు, కవర్లతో పెన్‌స్టాండ్, మొబైల్ హోల్డర్, డోర్ వ్యాంగర్, ప్లాస్టిర్ ఫ్లవర్ల తయారీని చేసి చూపించారు. జ్యూట్ బ్యాగులను వాడాలని తెలిపారు. బాలికల విద్యా ఆవశ్యకతపై వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, ప్రోగ్రాం ఆఫీసర్లు అఫ్రోజ్, జిహన్, బిందుశ్రీ, ముంతాజ్, డాక్టర్ ఎస్.శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఆమనగల్లు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధి శెట్టిపల్లికి చెందిన కొమ్ము రాములయ్య ఇటీవల మృతిచెందాడు. సోమవారం అతడి కుటుంబాన్ని కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఎగిరిశెట్టి సత్యం, మాజీ సర్పంచ్ గోదాదేవి పరామర్శించారు. బాధిత కుటుంటానికి రూ.5వేల సాయం అందజేశారు. ప్రభుత్వ పరంగా తగిన సాయమందేలా చూస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో వెంకటయ్య, నర్సింహ, గోపి తదితరులు ఉన్నారు.

మృతురాలి కుటుంబానికి ...

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన వెంకటాపురం చంద్రమ్మ అనారోగ్యంతో సోమవారం మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, గ్రామ మాజీ సర్పంచ్ నవీన్‌కుమార్, మాజీ ఎంపీటీసీ మల్లేష్‌యాదవ్, అలాగే బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పట్వారి జగదీశ్వర్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి సానుభూతిని తెలిపారు. అలాగే అంత్యక్రియల కోసం ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు జగన్‌రెడ్డి, కృష్ణ, గణేష్, రమేష్, శ్రీనివాస్, మల్లేష్, శంకర్, శ్రీధర్, సాయిలు, జంగయ్య, ఉస్మాన్, అంజయ్యగౌడ్, నరసింహ, గణేష్, రామచంద్రి పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి


ఇబ్రహీంపట్నంలో కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఇబ్రహీంపట్నం, మార్చి24(ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం రాత్రి ఇబ్రహీంపట్నంలో సీపీఎం కాగడాల ప్రదర్శన నిర్వహించింది. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.సామేల్, మండల కార్యదర్శి బుగ్గరాములు, జంగయ్య, ఎల్లేష్, నర్సింహ, పురుషోత్తం, ఆనంద్, డీవైఎఫ్ఐ నాయకులు రాఘవేందర్, ఎస్ఎఫ్ఐ నాయకులు చరణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

తలకొండపల్లి: పడకల్‌లో భగత్‌సింగ్, సుఖదేవ్, రాజుగుర్ వర్ధంతి వేడుకను నిర్వహించారు. సీపీఎం, డీవైఎఫ్ఐ నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భగత్ సింగ్, సుఖదేవ్, రాజుగుర్ల చిత్రపటాలకు నివాళులర్పించారు. సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య హాజరయ్యారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి చిన్న వయసులోనే ఉరికొయ్యలను ముద్దాడిన మహనీయులు భగత్‌సింగ్, సుఖదేవ్, రాజుగుర్ అన్నారు. భగత్‌సింగ్ యువజన సంఘం అధ్యక్షుడు మహేశ్, రవి, ప్రవీణ్, మహేశ్, మల్లయ్య, రమేశ్ పాల్గొన్నారు.


నివాళులు అర్పిస్తున్న సీపీఎం, డీవైఎఫ్ఐ నాయకులు

పరిహారంపై తర్జనభర్జన

(ఐదో పేజీ తరువాయి)

ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని వెనుదిరిగారు. అయితే భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం ఏమేర పరిహారం అందిస్తుందో వేచి చూడాలి.

104 ఎకరాల అసైన్డ్ భూమి

హైదరాబాద్‌కు, విమానాశ్రయానికి చేరువలో కొత్తూర్ మండల పెంజర్ల గ్రామం ఉంది. గ్రామంలోని సర్వే నంబర్ 389లో 118 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. 50ఏళ్ల క్రితం ఎస్సీ, బీసీ, ఓసీలు 210 మంది రైతులకు ఎకర, ఆరఎకరం చెప్పున 104 ఎకరాలను ప్రభుత్వం పట్టాలిచ్చింది. మిగతా 14ఎకరాలు ప్రభుత్వ ఆధీనంలో ఉంది. అసైన్డ్ భూముల్లో కొందరు వ్యవసాయం చేసుకుంటున్నారు. మరికొందరు చిన్నచిన్న షెడ్లు ఏర్పాటు చేసుకుని పశువులు, గొర్రెలను మేపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు.

అభిప్రాయ సేకరణకు ముందుకురాని రైతులు

అసైన్డ్ భూముల స్వాధీనానికి ఆర్డీవో స్థాయి అధికారి ఆధ్వర్యంలో అధికారులు గ్రామంలో రెండుసార్లు ప్రజాభిప్రాయసేకరణ చేశారు. 2022లో ఒకసారి అభిప్రాయ సేకరణ నిర్వహించగా ఇటీవల షాద్‌నగర్ ఆర్డీవో సరిత ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు పరిహారంపై ప్రజాభిప్రాయసేకరణ చేపట్టారు. భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రెండు కోట్ల రూపాయలివ్వాలని, పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించాలని, ఇళ్ల నిర్మాణానికి ప్లాట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

మార్కెట్ విలువ రూ.20లక్షలు లోపే...

ప్రస్తుతం పెంజర్ల ప్రాంతంలోని భూములకు ప్రభుత్వ లెక్కల ప్రకారం ఎకరాకు మార్కెట్ విలువ రూ.19.69లక్షలే ఉంది. ప్రైవేట్ మార్కెట్‌లో మాత్రం రూ.కోట్ల ధర ఉంది.


ప్రజాభిప్రాయ సేకరణలో ఆర్డీవో(ఫైల్)

పెండింగ్ డీఏను వెంటనే విడుదల చేయాలి

మంచాల, మార్చి 24(ఆంధ్రజ్యోతి):ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం బకాయిలను విడుదల చేయాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.రాజిరెడ్డి ప్రభుత్వాన్ని సోమవారం కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 2025-డీఏను ప్రకటించిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కరువుభత్యం విడుదలలో తీవ్రజాప్యం చేస్తోందని తెలిపారు. రెండేళ్లుగా డీఏ చెల్లించక ప్రభుత్వ ఉద్యోగులు రూ.2-4 లక్షలు నష్టపోయారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీతభత్యాలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

ఉపాధి కల్పించేందుకు పెద్దపీట వేయాలి


యూనిట్‌ను ప్రారంభిస్తున్న రాఘవేందర్

కడ్తాల్, మార్చి24(ఆంధ్రజ్యోతి): యువత ఉపాధి కల్పనకు ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోల్ల రాఘవేందర్ కోరారు. అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని కోరారు. మక్తమాదారం గేటు వద్ద ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి యూనిట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం, బ్యాంకర్లు ఉపాధికి రుణాలివ్వాలని కోరారు. యువశక్తి దేశానికి గొప్ప నిధి అన్నారు. కార్యక్రమంలో శివకుమార్, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఇసుక ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్ సీజ్



మాడ్గుల, మార్చి 24(ఆంధ్రజ్యోతి):ఇర్విన్ పరిసర ప్రాంతాల్లో అక్రమంగా ఇసుక తోడుతున్న, తరలిస్తున్న వాహనాలను పోలీసులు సోమవారం సీజ్ చేశారు. గస్తీ తిరుగుతుండగా ఇర్విన్ వాగులో ఎక్స్‌కవేటర్(టీఎస్07 జెఫ్ 7726)తో ట్రాక్టర్(టీఎస్07 హెచ్‌వి5482)లో ఇసుక నింపుతుండగా పోలీసులు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఇసుక తరలిస్తున్న వాహనాల డ్రైవర్లు కాసు నవీన్‌రెడ్డి, కాసు భోజిరెడ్డి ఇర్విన్ గ్రామానికి చెందిన వారని, వారిపై కేసు నమోదు చేశామని సీఐ వేణుగోపాల్‌రావు పేర్కొన్నారు.

సంక్షిప్తంగా

● **కేశంపేట:** ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి మృతిచెందిన కుమారుడి జ్ఞపకార్థం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు వితరణ చేశారు. తొమ్మిదిరేకులకు చెందిన రాజమోని శశాంక్‌గౌడ్ అమెరికా వెళ్లి అక్కడ అనారోగ్యానికి గురై మృతిచెందాడు. కుమారుడి జ్ఞాపకార్థం తండ్రి వెంకటయ్యగౌడ్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం నోట్‌పుస్తకాలు అందజేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలతో తన కొడుకును గుర్తు చేసుకుంటున్నాని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, కృష్ణారెడ్డి, రవిప్రకాశ్ రావు, హెచ్‌ఎం శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు: రంజాన్ పండుగను పురస్కరించుకొని సోమవారం రాత్రి కొత్తగూడలో ఉన్న ముస్లింలకు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు శేఖర్‌గౌడ్ ఇఫ్తార్ విందు ఇచ్చారు. నాయకులు బొక్క సురేందర్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, సంజీవరెడ్డి, యాదయ్యగౌడ్ ముస్లింలు పాల్గొన్నారు.

● **మంచాల:** ఆరుట్లలో కాంగ్రెస్ సోషల్‌మీడియా మండల కన్వీనర్ బుర్హాన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. రంజాన్ సందర్భంగా ఏర్పాటుచేసే ఇఫ్తార్‌లు మతసామర్యానికి ప్రతీకగా నిలుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రమాకాంత్‌రెడ్డి, చంద్రయ్య, సురేష్, ఇమ్రాన్, అజీమ్, గప్పార్, ఇర్ఫాన్, పాండాల శ్రీనివాస్, డి.రాజు తదితరులు పాల్గొన్నారు.

● **యాచారం:** యాచారం మండలంలోని మాల్ సంతను సోమవారం వేలం వేశారు. సంతను మాల్ గ్రామానికి చెందిన గుడుగుంట్ల కృష్ణ రూ.3.10లక్షలకు దక్కించుకున్నాడు. అలాగే తైబజార్‌ను నార్కట్‌పల్లికి చెందిన దూదిమెట్ల నవీన్‌యాదవ్ రూ.82.5లక్షలకు వేలంలో దక్కించుకున్నారు.

● **కేశంపేట:** మండలంలోని మూడు సెంటర్లలో పది పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. పరీక్షలకు 100 శాతం విద్యార్థులు హాజరు అవుతున్నారు. కేశంపేటలో రెండు సెంటర్లు, కొత్తపేటలో ఒక సెంటర్ ఉంది. వీటిల్లో 548 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. సోమవారం ఇంగ్లిష్ పరీక్ష రాశారు. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ అజంఅలీ నిత్యం తనిఖీ చేస్తున్నారు. కేశంపేట సీఐ నరహరి నేతృత్వంలో పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు కొనసాగిస్తున్నారు. పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయిస్తున్నారు.